క్లుప్తంగా

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ

సీతానగరం: లంకూరు ఏటిగట్టు వద్ద ద్వాదశ జ్యోతిర్లింగ సహిత మృత్యుంజయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరిగింది. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరై, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, ఉపసర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మండల ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, సీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, పార్టీ నాయకులు మద్దాల కొండలరావు, మట్ట మునియ్య, ముళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు

క్రీడా పోటీలు ప్రారంభం

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద మండల స్థాయి స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ ఎంపికలు పాఠశాల హెచ్ఎం పల్లా వీర ప్రభాకరరావు లాంఛనంగా ప్రారంభించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తొలిరోజు కబడ్డీలో బాలికల విభాగంలో కాపవరంపై పందలపాక జట్టు విజయం సాధించిందన్నారు. బాల్ బ్యాడ్మింటన్‌లో బాలికల విభాగంలో బిక్కవోలు, ఊలపల్లి పాఠశాల జట్లు పోటీ పడగా బిక్కవోలు పాఠశాల క్రీడాకారులు నియోజకవర్గ స్థాయికి అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు జంగా శ్రీనివాస్‌ప్రసాద్, పీడీ ఎం.ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

సీతానగరం: స్థానిక పంచాయతీ పరిధిలోని లంకూరు శివారున పేకాట ఆడుతున్న 13 మందిని అరెస్టు చేశామని ఎస్సై కె.చిరంజీవి సోమవారం తెలిపారు. వారి నుంచి రూ. 5,320 స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

ఆక్రమిత భూముల స్వాధీనం

రాజానగరం: మండలంలోని కొత్తతుంగపాడులో హితకారిణి సమాజానికి చెందిన సర్వే నంబరు 850లోని 4.79 ఎకరాల భూమిలో ఆక్రమణలు తొలగించి, పూర్తిస్థాయిలో స్వాధీన పర్చుకున్నామని హితకారిణి సమాజం చైర్మన్ కాశి బాలమునికుమారి తెలిపారు. ఆక్రమణదారులు కోరిన గడువు సోమవారానికి ముగియడంతో ఈ చర్యలు తీసుకున్నామన్నారు. స్వాధీన పర్చుకున్న భూములలో నోటీసు బోర్డులను కూడా ఏర్పాటు చేశామన్నారు.

రాట ముహూర్తం

పెదపూడి: ఈ నెల 18న వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాలు నిర్వహించేందుకు మండలంలోని పెదపూడి గ్రామ పంచాయతీ సమీపంలోని శ్రీసిద్ధి వినాయక గ్రౌండ్ యూత్ ఆధ్వర్యంలో రాట మూహూర్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ పండితులు కొమాల్లపల్లి సత్యవీర వెంకట్రావు మాట్లాడుతూ ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ వరకూ నిర్వహించడానికి నిర్ణయించామన్నారు.

వేదిక నిర్మాణానికి శంకుస్థాపన

మధురపూడి: కోరుకొండ మండలం బూరుగుపూడి ఎస్సీపేటలో సామాజిక అవసరాల కోసం వేదిక నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు కంటే వినయ్ తేజ సొంత నిధులతో దీని నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. వినయ్ తేజ, ఆయన సతీమణి సుప్రియ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులే

పెదపూడి: సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని పెదపూడి ఎస్ఐ పి.వాసు తెలిపారు. మండలంలోని పుట్టకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఈ నెల 5న జరిగే ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులు ఎ.నాగప్రసాద్, శ్రీధర్, మెహర్, శ్రీనివాసులకు శాలువా కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఎల్ఐసీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన

రాజానగరం: జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రభుత్వ ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా పాత వెలుగుబందలో సోమవారం నేత్ర దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను చైతన్య పరిచారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

రాజానగరం: శ్రీకృష్ణపట్నం జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరుగురు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు దివాన్‌చెరువులోని కెనరా బ్యాంకు ప్రోత్సాహకాలు అందజేసింది. 5, 6, 7 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2500, ఆపై 10వ తరగతి వరకూ రూ. 5 వేలు చొప్పున విద్యాజ్యోతి పథకం ద్వారా అందజేశామని బ్యాంకు మేనేజర్ డి.ఢిల్లీరావు తెలిపారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కాపవరంలో గడప గడపకూ..

మధురపూడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, వారి ఆర్థికాభివృద్ధికి దోహద పడుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామంలో మూడో రోజు సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత స్థానిక వినాయకుని ఆలయంలో స్వామిని దర్శించుకున్న అనంతరం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం 6 గంటలకు గణేష్ నగర్‌లో గడప గడపకూ తిరిగారు. ఈ సదంర్భంగా స్థానికులు మురుగునీటి కాలువల నిర్మాణం, ఇళ్ల స్థలాలు, తాగునీటి సమస్యలను తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ కాపవరంలో సొంతిళ్లు లేని పేదలకు త్వరలోనే ఇళ్లస్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కోరుకొండ, కాపవరం గ్రామస్తుల కోసం ఎంపిక చేసిన ఇళ్ల స్థలాల విషయం కోర్టు వివాదంలో ఉండటంతో కొత్తగా స్థలాలను ఎంపికచేయనున్నట్టు తెలిపారు. కాపవరం అభివృద్ధికి చంద్రబాబు పాలనలో కేవలం రూ. 80 లక్షలు కేటాయిస్తే, జగనన్న ప్రభుత్వం రూ.3 కోట్ల రూపాయలు నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్ జాజుల రాము, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గణేశుల పోసియ్య, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు ఇండిగమెల్లి సత్యనారాయణ, హితకారిణి సమాజం డైరెక్టర్ కాలచర్ల శివాజీ, ఎంపీటీసీ కాలచర్ల నాగు, వైఎస్సార్ సీపీ నాయకులు అడపా బాబీ, శ్రీరంగం శ్రీను, అయిల శ్రీను, బుగ్గిలం భాను, బయ్యే దుర్గయ్య, కొడేటి నాగార్జున, సచివాలయం సెక్రటరీ అన్వర్ పాల్గొన్నారు.


కాపవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వినతి

గోకవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా గోకవరంలో అర్హులైన వారికి పంచాయతీ పరిధిలోని ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేశారు. గోకవరంలో సుమారు 600 మందికి తంటికొండకు వెళ్లే మార్గంలో ఇళ్ల స్థలాలకు పట్టాలు మంజూరు చేశారన్నారు. మరో 800 మందికి రాజమహేంద్రవరం వెళ్లే మార్గంలోని గంగాలమ్మ ఆలయం సమీపంలో స్థలం మంజూరు చేసినప్పటికీ ఆ స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో పట్టాలు పంపిణీ నిలిచిపోయిందన్నారు. తంటికొండకు వెళ్లే మార్గంలో సుమారు 26 ఎకరాల సీలింగ్ భూమి ఉందని, ఈ భూమిని మిగిలిన అర్హులకు పంచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే ల్యాండ్ సీలింగ్ భూములను గుర్తించి అర్హులకు పంచే విధంగా చర్యలు చేపడతామని కలెక్టర్ హామీ ఇచ్చారని ఎంపీపీ తెలిపారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రంగంపేట: ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి జె.జెస్సీఫ్లోరెన్స్ అధ్యక్షతన నిర్వహించిన పోషకాహార మాసోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొల్లాటి ఇజ్రాయిల్, మాజీ సర్పంచ్ మేడిశెట్టి రవిశంకర్, బి. శ్రీరామరాజు, ఎంఈఓ–2 టి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.



రంగంపేటలో పౌష్టికాహార ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

ఫ్యామిలీ డాక్టర్‌తో విస్తృతంగా వైద్యసేవలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన, ఎంపీడీవో కె.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంఈవో కె.స్వామి నాయక్ మాట్లాడుతూ మండలంలోని 17 స్కూళ్లను ఎంపిక చేసి, జిల్లా అధికారులకు నివేదిక పంపామన్నారు. ఎంపికై న పాఠశాలల్లో ప్రధాన మంత్రి స్కీమ్ ద్వారా అన్ని వసతులు కల్పిస్తారన్నారు. విద్యుత్ శాఖ ఏఈ చంద్రమోహన్ మాట్లాడుతూ గృహాలకు కొత్త విద్యుత్ కనెక్షన్ల కోసం గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జగనన్న లేఅవుట్లలో పూర్తిస్థాయిలో విద్యుత్ లైన్లు వేసినట్టు తెలిపారు. కాగా.. సీతానగరం కైలాసభూమి వద్ద విద్యుత్ స్తంభాలు వేసి, సరఫరా చేయాలని పలుమార్లు కోరామని, ఇంత వరకూ చర్యలు చేపట్టలేదని సింగవరం సర్పంచ్ సంగన చిన పోశయ్య అన్నారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండలంలో మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని, సీతానగరం పీహెచ్‌సీ.. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌గా మార్పు చెందిందన్నారు. సీతానగరం ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్లో వంట భవనాన్ని విస్తరించాలన్నారు. సమావేశానికి గైర్హాజరైన వివిధ శాఖల అధికారులకు మెమోలు జారీ చేయాలని ఏవో గోపాల్‌ను ఎంపీడీవో రమేష్ ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కో కన్వీనర్ కరుటూరి శ్రీహరి బాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ రాజు

ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

బిక్కవోలు: మండలంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపికైనట్లు ఎంఈవో సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పందలపాక మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కర్రి వీర్రాఘవరెడ్డి మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారన్నారు. అలాగే మెళ్లూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జుత్తుక కామేశ్వరరావును అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు.

రాజానగరం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం అందించే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు జిల్లా స్థాయిలో మండలం నుంచి లాలాచెరువు హెచ్‌బీ కాలనీలోని ఎంపీఈపీ పాఠశాల ఉపాధ్యాయుడు పి.సత్యప్రసాద్ ఎంపికయ్యారు. జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే ఉపాధ్యాయ దినోత్సవంలో ఈ అవార్డును అందుకోనున్నారు.

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి.విజయ మణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. నాడు–నేడు పనులతో పాఠశాల అభివృద్ధికి చేసిన కృషి, బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పడం, మెరుగైన విద్యా బోధన చేసినందుకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా విజయ మణిని కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి అభినందించారు.


కర్రి వీర్రాఘవరెడ్డి | జుత్తుక కామేశ్వరరావు | పి. సత్య ప్రసాద్

దుప్పలపూడి ఉపసర్పంచ్‌గా శివపద్మిని

అనపర్తి: మండలంలోని దుప్పలపూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ పదవికి దుప్పలపూడి పంచాయతీ కార్యాలయంలో సోమవారం జరిగిన ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఈ ఎన్నికలో దుప్పలపూడి గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వల్లభశెట్టి రామసతీష్ భార్య వల్లభశెట్టి శివపద్మిని ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తంగా పది మంది సభ్యులు ఎన్నికకు హాజరుకావాల్సి ఉండగా 1, 9, 3, 4, 8, 10 వార్డు సభ్యులు వి.శివపద్మిని, డి.మణికంఠ, నందికోళ్ల ధనలక్ష్మి, ఓగిరెడ్డి మణి, చిత్సారపు అనంతలక్ష్మి, మేడపాటి దుర్గలు ఎన్నికకు హాజరయ్యారు. నిర్ణీత సమయం వరకూ వేచి చూసిన ఎన్నికల అధికారి పద్మజ తగినంత కోరం ఉండడంతో ఎన్నికకు ఉపక్రమించారు. ఎన్నికకు హాజరైన ఆరుగురు వార్డు సభ్యులు చేతులెత్తి తమ మద్దతును తెలియజేయడంతో ఉపసర్పంచ్‌గా వల్లభశెట్టి శివపద్మిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. దుప్పలపూడి పంచాయతీ ఉపసర్పంచ్ ఎన్నికలో వార్డు సభ్యుల బలం లేకపోవడంతో సర్పంచ్ నల్లమిల్లి సావిత్రి వర్గం ఎన్నికకు గైర్హాజరై చేతులెత్తేశారు. వైఎస్సార్ సీపీ మద్దతుదారు శివపద్మిని ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సంబరాల్లో పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహనబాలకృష్ణారెడ్డి, ఎస్ఎస్ తదితరులు పాల్గొన్నారు.

కాండ్రేగుల ఉపసర్పంచ్‌గా సూర్యనాగమ్మ

పెదపూడి: కాండ్రేగుల పంచాయతీ ఉపసర్పంచ్‌గా 10వ వార్డు సభ్యురాలు సాంబత్తుల సూర్యనాగమ్మ ఎన్నికై నట్లు కరప మండలం ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాస్ ధ్రువీకరించారు. ఈ సందర్భంగా సూర్యనాగమ్మ కొడుకు వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు సాంబత్తుల చంటి మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతుల ఆశీస్సులతో తన తల్లి ఉప సర్పంచ్‌గా ఎన్నికై ందని కృతజ్ఞతలు తెలిపారు. సూర్యనాగమ్మకు ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కేవీవీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల వెంకటరమణ తదితరులు అభినందనలు తెలిపారు.

నాగంపల్లి ఉప సర్పంచ్‌గా చంటమ్మ

సీతానగరం: నాగంపల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా ఎనిమిదో వార్డు మెంబర్ వినపర్తి చంటమ్మ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ దోశపాటి వీరచంద్రరావు అధ్యక్షతన జరిగిన పాలకవర్గం సమావేశంలో ఈవోపీఆర్డీ మూర్తి పాల్గొన్నారు. పంచాయతీ పాలక మండలి ఒప్పందం ప్రకారం ఒకటో వార్డు మెంబర్ దూళ్ల నగేష్ రెండున్నరేళ్లు ఉపసర్పంచ్‌గా సేవలు అందించారు. ఆయన కాలపరిమితి పూర్తి అవ్వడంతో చంటమ్మను ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌గా ఎంపిక చేశారు. ఆమెకు ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ మోహన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.


ఉపసర్పంచ్‌గా ఎన్నికైన శివపద్మినికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి పద్మజ


కాండ్రేగుల ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు సూర్యనాగమ్మకు ధ్రువీకరణపత్రం అందజేస్తున్న అధికారులు


నాగంపల్లి ఉప సర్పంచ్ చంటమ్మతో సర్పంచ్ వీరచంద్రరావు, వార్డు మెంబర్లు

మహిళల ఆర్థిక అభ్యున్నతికి కృషి

రాజానగరం: రాష్ట్రంలో ప్రతి మహిళా ఆర్థికంగా నిలదొక్కుకునేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పల్లకడియం, రామస్వామిపేటలలో స్వయం సహాయక సంఘాల మహిళలతో సోమవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలలో మహిళలకే అగ్రాసనం వేస్తున్నారన్నారు. డ్వాక్రా సంఘాల రుణాలను మాఫీ చేస్తానంటూ గతంలో చంద్రబాబు ఏవిధంగా మోసం చేశారో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. గత ఎన్నికల సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అప్పటి వరకు స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులలో ఉన్న రుణాలను నాలుగు విడతలుగా మీ ఖాతాలలోకి జమ చేసిన విషయాన్ని మరచిపోవద్దన్నారు. రాబోయే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేసే విధంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలన్నారు. సమావేశాలలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.


పల్లకడియంలో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

8 నుంచి క్రీడా పోటీలకు ఎంపికలు

పెదపూడి: ఈ నెల 8, 11 తేదీల్లో పెదపూడిలోని గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలురు, బాలికలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో జట్ల ఎంపికలు నిర్వహించనున్నామని ఎంఈఓ–1, ఎంఈఓ–2 వెంకటేశ్వరరావు, సత్యనారాయణ తెలిపారు. వారు సోమవారం పెదపూడిలో మాట్లాడుతూ మొత్తంగా 9 క్రీడా విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, టెన్నీకాయిట్, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, త్రోబాల్ తదితర విభాగాల్లో విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కె.సత్యనారాయణ, పీడీ గిరి తదితరులు పాల్గొన్నారు.

రాజానగరం: స్కూల్ గేమ్స్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఈనెల 8 నుంచిడి జరగనున్నాయని మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతి ప్రసాద్ తెలిపారు. 8న అండర్ 17 విభాగంలో బాలురకు, 11న అండర్ విభాగంలో 14 బాలురకు, 12న 14, 17 విభాగాలలో బాలికలకు వాలీబాల్, కబడ్డీ, కోకో, షటిల్ బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్‌లో ఎంపికలు జరుగుతాయన్నారు.

చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ


చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: దైనందిన ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత పెరుగుతోందని, ఆసక్తి కల మహిళలు ఈ రంగంలో పారిశ్రామికవేత్తలుగా ఎదగవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీ అనే అంశంపై సోమవారం కేవీకేలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో శిక్షణతో పాటు ప్రదర్శన కూడా ఏర్పాటుచేశారు. సీతానగరానికి చెందిన మాస్టర్ ట్రైనర్ చిడిపి నాగభూషణం ఆధ్వర్యంలో చిరుధాన్యాలైన రాగులు, సామలు, ఊదలు, అరికెలు, అండు కొర్రలు, సజ్జలు, జొన్నలతో బిస్కెట్లు, కేక్‌లు, మురుకులు, మున్నగు ఆహారా పదార్థాల తయారీపై మహిళలకు శిక్షణ ఇచ్చారు. మైదాను వాడకుండా బెల్లం, చిరుధాన్యాల మిశ్రమంతో వివిధ రకాల ఆహార పదార్థాలను ఏవిధంగా తయారుచేయవచ్చునో తెలియజేశారు. కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ వై.జ్యోతిర్మయి, మేనేజర్ డాక్టర్ బి. తాతబ్బాయి, డీపీఎం మహ్మద్ వలీ, కేవీకే ఉద్యానవన పంటల అధికారి సత్యవాణి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

మధురపూడి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ప్రొబిషనరీ ఎస్పీ పంకజ్ కుమార్ మీనా హెచ్చరించారు. కోరుకొండ మండలం కణుపూరు గ్రామంలోని ఎస్సీపేటలో సోమవారం ఆయన పర్యటించారు. అక్కడ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శిలాఫలకం ఏర్పాటు విషయమై తగాదా ఏర్పడిన నేపథ్యంలో ఎస్సీలతో సమావేశం నిర్వహించారు. ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా శాంతి కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు. కాగా..జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద శిలాఫలకాన్ని ఏర్పాటుచేసేందుకు జనసేన పార్టీకి చెందిన స్థానికులు ప్రయత్నించారు. దాన్ని స్థానికులు అడ్డుకున్నారు. దీంతో వివాదం ఏర్పడింది. విగ్రహం వద్ద రాజకీయ నాయకుల పేర్లు ఉండకూడదన్న నిబంధన మేరకే దానిని ఏర్పాటు చేశారు. దానిని పాటించకుండా శిలాఫలకాన్ని ఏర్పాటు చేయడాన్ని స్థానికులు వ్యతిరేకించారు.

మామిడాడపై కలెక్టర్‌కు వినతి

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లాలో గొల్లల మామిడాడను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే మండలంలోని గ్రామాల ప్రజలకు ఎన్నో విధాలుగా సౌలభ్యం కలుగుతుందని అఖిలపక్ష నాయకులు కలెక్టర్ కృతికా శుక్లాకు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం అఖిలపక్ష కన్వీనర్ కె.భామిరెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ గొల్లల మామిడాడ మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే తొమ్మిది గ్రామాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. దీని వల్ల మామి డాడ విద్య, వైద్య, వ్యాపార, ఆధ్యాత్మిక రంగాల్లో పురోగతి సాధిస్తుందన్నారు. మామిడాడను మండల కేంద్రంగా ఎవరూ వ్యతిరేకించొద్దని కోరారు. కార్య క్రమంలో అఖిలపక్ష నాయకులు జుత్తుక శ్రీను, ఆర్.నాగు, శివరామిరెడ్డి, నాగమళ్ల వీరభద్రరావు, కొల్లు పెద కాపు, మాజీ ఎంపీటీసీ సబ్బెళ్ల గంగిరెడ్డి, కుడుపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మామిడాడను మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ కలెక్టరేట్‌కు చేరుకున్న అఖిలపక్ష నాయకులు

197 మందికి వైద్యసేవలు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో సోమవారం రాజమహేంద్రవరం రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సారథ్యంలో కంటి వైద్యశిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు సత్యం రమేష్ బాబు, రాయుడు శ్రీనివాస్ సుమారు 197 మందికి వైద్యసేవలు అందించారు. ఎనిమిది మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, గద్దె వెంకట సత్యనారాయణ , కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గైట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్‌కు అవార్డు

రాజానగరం: గైట్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వల్లీమాధవికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. విజయవాడలోని సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీస్ సంస్థ ప్రకటించిన ఈ అవార్డును ఆదివారం యాప్సీ వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు నుంచి ఆమె అందుకున్నారు. ఆమెకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.